
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 26 । మార్చి । 2024



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



గానోడెర్మా తెగులు తీరే వేరు

కొబ్బరి పంట దిగుబడిని గణనీయంగా తగ్గించే కారణాలలో తెగుళ్లు ముఖ్యమైనవి. వాటిలో గానోడెర్మా శిలీంద్రం వలన కలిగే ఎర్రలక్క తెగులు అతి ప్రమాదకరం.- 8లో▶

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.41
కాకినాడ	6.24	4.41
అమలాపురం	6.24	4.41

రహదారులకు కొత్త కళ

- కోనసీమ జిల్లాలో ప్రధాన రహదారుల అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- 2017 నుంచి గాలికి వదిలేసిన టీడీపీ

సాక్షి అమలాపురం: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 నుంచి ఆధునికరణకు నోచుకోని జిల్లాలో కీలక రహదారులకు ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నిధులు మంజూరు చేయడంతో ఆర్అండ్‌బీ పరిధిలోని ఈ రహదారులను ఆధునీకరించారు. జిల్లాలో పలు నియోజకవర్గాల మీదుగా సాగే ప్రధాన రహదారులు, నియోజకవర్గాల పరిధిలో ముఖ్యమైన రోడ్లను అభివృద్ధి చేశారు. బీటీ, సీసీ రోడ్లు వేయడంతో పాటు కాలువల వెంబడి రిటైనింగ్ వాల్స్, అవసరమైన చోట వంతెనలను వెడల్పు చేశారు. జాతీయ రహదారుల తరహాలో ఆధునీకరించారు. ఇందు కోసం సీఆర్ఐఎఫ్ నిధులు రూ.229.40 కోట్లు, మరమ్మతులు, నిర్వహణకు రూ.76.38 కోట్లు, తాజాగా రూ.47.86 కోట్లు మంజూరు కాగా.. పనులు చాలా వరకూ పూర్తయ్యాయి.



జాతీయ రహదారి తరహాలో కోనసీమలో ఆధునీకరించిన రహదారి

కోనసీమలో కీలకం



ఆధునీకరించిన పి.గన్నవరం రహదారి

రాజవరం నుంచి పొదలాడ రోడ్డు పి.గన్నవరం పంట కాలువను ఆనుకుని ఉండేది. కోనసీమలో కీలకమైన ఈ రహదారి పలు చోట్ల కుంగి ప్రమాద భరితంగా మారింది. ఈ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు పలు చోట్ల లాంగ్ రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించి సీసీ, బీటీ రోడ్డుగా ఆధునీకరించారు. పి.గన్నవరం నుంచి గంటి పెదపూడి వరకూ రూ.20 కోట్లు, పి.గన్నవరం నుంచి చాకలిపాలెం వరకూ రూ.6 కోట్లు, గోపాలపురం నుంచి గంటి వరకూ **రహదారి ఆధునీకరణ పనులు జరిగాయి.**



అమలాపురం - ముక్కామల బైపాస్ రోడ్డు

రూ.30 కోట్లతో విస్తరణ

అమలాపురం ఈదరపల్లి వంతెన వద్ద నుంచి అంబాజీపేట మండలం ముక్కామల వకూకు బైపాస్ రోడ్డు రూ.30 కోట్లతో రోడ్డును విస్తరించారు. జాతీయ రహదారి తరహాలో ఆధునీకరించారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై వాహనాలు రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. రోడ్డు అభివృద్ధిపై వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం **చేశారు.**

ముమ్మిడివరం



ఆధునీకరించిన పల్లంకుర్రు - బలుసుతిప్ప **రహదారి**

కాట్రేనికోన మండలం పల్లంకుర్రు నుంచి బలు**సుతిప్ప, కంది**కుప్ప నుంచి సముద్రతీరం వరకూ, **ఆనాతవరం** నుంచి పల్లంకుర్రు రోడ్లలో ఎంపిక **చేసి ప్యాకేజీల**లో రూ.3.50 కోట్లతో రహదారుల **నిర్మాణ పను**లు జరిగాయి.

పి.గన్నవరం



అమలాపురం తోట్లపాలెం నుంచి అంబాజీపేట సెంటర్ వరకూ నిర్మించిన రోడ్డు

అమలాపురం మండలం తోట్లపాలెం వద్ద నుంచి గున్నేపల్లి అగ్రహారం, వాకలగరువు, నందంపూడి రోడ్డును రూ.6 కోట్లతో విస్తరించారు. కొత్త రోడ్డును నిర్మించడంతో ప్రయాణం సుఖంగా సాగుతోంది.

రాజోలు



శివకోడు - మానేపల్లి రహదారి

రాజోలు నియోజకవర్గంలో కీలకమైన చింతలపల్లి వంతెన నుంచి మలికిపురం వరకూ, కేశవదాసుపాలెం - కేశనపల్లి, కూనవరం- కేశనపల్లి రహదారులను రూ.6.30 కోట్లతో ఆధునీకరించారు.

కొత్తపేట



గోపాలపురం వద్ద సీసీ రోడ్డు

రావులపాలెం మండలం గోపాలపురం వద్ద జాతీయ రహదారి నుంచి లాకుల వరకూ, రావులపాలెం బస్టాండ్ నుంచి సీఆర్సీ కబేలా వరకూ, కొమరాజులంక వంతెన నుంచి కొమరాజులంక గ్రామంలోకి, ముమ్మిడివరప్పాడు మెయిన్ రోడ్డు ఆధునీకరణ, రావులపాలెం బలరామరెడ్డి జంక్షన్ నుంచి భవానీ ఆస్పత్రి వరకూ, ఆదిలక్ష్మీ నగర్ వీధి నుంచి శివాలయం వరకూ రోడ్లను రూ.25 కోట్లతో ఆధునీకరిస్తున్నారు.

గోతుల రోడ్డుకు మోక్షం

అమలాపురం నుంచి బొబ్బర్లంక రహదారి 2017 నుంచి గోతులతో ఉండేది. కొత్తపేట నుంచి రావులపాలెం వరకు రూ.ఆరు కోట్లు, కొత్తపేటలో సీసీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, కొత్తపేట పలివెల వంతెన వద్ద నుంచి ముక్కామల లాకుల వరకూ రూ.9.93 కోట్లతో అభివృద్ధి చేశారు. ఇదే రోడ్డులో తాజాగా రూ.నాలుగు కోట్లతో రోడ్డు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.



కొత్తపేట - రావులపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు

మండపేట



మండపేట - ద్వారపూడి రోడ్డు

మండపేట నుంచి ద్వారపూడి రహదారిని పలుచోట్ల సీసీ రోడ్డుగా, బీటీ రోడ్డుగా నిర్మించారు. చిన్న చిన్న పనుల మినహా దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తయ్యింది. మొత్తం ప్యాకేజీ విలువ రూ.25 కోట్లు. ఇప్పటి వరకూ రూ.13.20 కోట్లు ఖర్చు చేశారు.

రామచంద్రపురం

రామచంద్రపురం మండలం ద్రాక్షారామ - పానింగపల్లి మధ్య నిర్మించిన రహదారి ఇది. దీనికి రూ.7.45 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం రూ.20 కోట్ల ప్యాకేజీలో ఈ రోడ్డు ఒకటి.



ద్రాక్షారామ నుంచి పానింగపల్లి రహదారి

అమలాపురం



అమలాపురం - బెండమూర్లంక రహదారి

అమలాపురం నుంచి అల్లవరం మండలం బెండమూర్లంక మధ్య రెండు దఫాలుగా వేసిన రహదారి ఇది. తొలి దఫా రూ.12 కోట్లు, రెండో దశలో రూ.20 కోట్లు చొప్పున మొత్తం రూ.32 కోట్లతో రోడ్లు విస్తరించారు. అలాగే కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టారు.

న్యూస్‌రీల్

మిథున్‌రెడ్డి పర్యటన వాయిదా

రాజోలు: నియోజకర్గంలోని చాకలిపాలెంలో మంగళవారం జరగాల్సిన ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన వాయిదా పడిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. ఆయన ఆదివారం తాటిపాకలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అయితే మిథున్‌రెడ్డి పర్యటనలో చిన్న మార్పుల కారణంగా సమావేశం తాత్కాలికంగా వాయిదా పడిందన్నారు.

కోడ్ కూసినా ముసుగు వేయరా!



భీమనపల్లిలో ముసుగు లేకుండా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఎన్నికల కోడ్‌ను విధించి పది రోజులు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో మండల అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. అయినా కొన్ని చోట్ల ముసుగులు పడలేదు. భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెంలో మెయిన్ రోడ్డు చెంతనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహం ముసుగు లేకుండా కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఆ గ్రామంలో అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

27న మోడ్రన్ పెంటాథలాన్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యాన ఈ నెల 27న మోడ్రన్ పెంటాథలాన్ విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రసాద్ సోమవారం ఈ విషయం తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఆదేశాల మేరకు అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలు ఎంపికలు ప్రారంభమవుతాయని వివరించారు. అలాగే వాకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో అండర్-17 బాలురు, బాలికల విభాగాల పవర్ లిఫ్టింగ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. పెంటాథలాన్ పోటీలు ఈ నెల 30, 31 తేదీల్లో తిరుపతిలోను, పవర్ లిఫ్టింగ్ పోటీలు 30, 31 తేదీల్లో విజయవాడలో జరుగుతాయని పేర్కొన్నారు ఆసక్తి ఉన్న వారు ఈ ఎంపికలకు హాజరు కావాలని, వివరాలకు 94908 96851 నంబరులో సంప్రదించాలని ప్రసాద్ కోరారు.

13 నుంచి బృహతి సహస్ర యాగం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ మధ్వసభ కమిటీ ఏర్పడి 145 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మధ్వ సభ కమిటీ ఆధ్వర్యాన వచ్చే నెల 13, 14 తేదీలో బృహతి సహస్ర యాగం నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి తెలిపారు. యాగ నిర్వహణ విధివిధానాలపై రామారావుపేటలోని మధ్వ సభ ప్రాంగణంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం మఠ ప్రత్యేక ప్రతినిధి, సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ పర్యవేక్షణలో ఈ యాగం నిర్వహిస్తున్నామన్నారు. 13న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠ, దేవతాహ్వానం జరుగుతాయని తెలిపారు. ఈ హోమ విశేషాలపై సుధాపండితులు విజయసింహాచార్, రఘుప్రేమాచార్, రఘోత్తమాచార్, సుమంతాచార్ పాటిల్ సాయంత్రం ప్రవచనం చేస్తారన్నారు. 14న బృహతి యాగ హవనం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని రాఘవేంద్ర స్వామి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి యాతగిరి పరశురామ్, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, చిల్లరిగ ప్రసాద్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సోమవారం కిక్కిరిసిపోయింది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు అధిక సంఖ్యలో రత్నగిరికి తరలివచ్చి, సత్యదేవుని వ్రతాలు ఆచరించి, స్వామివారిని దర్శించారు. వారితో పాటు సాధారణ భక్తులు కూడా రావడంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. హోలీ పండగ సందర్భంగా సెలవు దినం కావడంతో కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 2,100 జరిగాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రద్దీ కారణంగా ప్రదక్షిణ దర్శనాన్ని మధ్యాహ్నం వరకూ నిలిపివేశారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం



ఇందుపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఇందుపల్లిలో కార్యకర్తలతో సమావేశం

అమలాపురం రూరల్: సంక్షేమ పథకాల రథ సారథిగా గుర్తింపు పొందిన జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ సీఎంగా గెలిపించనున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం ఇందుపలిల్లోని ఏ వన్ కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సీపీ రూరల్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 99 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. 58 నెలల కాలంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం కారణంగా వచ్చే ఎన్నికల్లో ప్రజలు పాజిటివ్ ఓటుతో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక వైపు, పచ్చపార్టీల కుటమి మరో వైపు ఉన్నాయన్నారు. మనమందరం ధర్మం వైపున నిలబడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబు పాలనలో రూ.1,000 చొప్పున 33 లక్షల మందికి పింఛన్ ఇస్తే సీఎం జగన్ పాలనలో 66 లక్షల మందికి ఫించన్ అందిస్తున్నారన్నారు. 27వ తేదీ బుధవారం ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు మంత్రి విశ్వరూప్ తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాస్, కామిశెట్టి శ్రీనివాస్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సూదా గణపతి, బొక్కా ఆదినారాయణ, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, సరేళ్ల రామకృష్ణ, చొల్లంగి సుబ్బిరామ్, కర్రెళ్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

- భయపడే ప్రతిపక్షాల పొత్తులు
- ఎమ్మెల్సీ త్రిమూర్తులు



ఐక్యత చాటుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్, ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మీకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని ప్రజలను ధైర్యం అడిగిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని తన స్వగ్రామమైన వెంకటాయపాలెంలో సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని, అలాంటప్పుడు ఆ పార్టీలు పొత్తులతో కాకుండా ఒంటరిగా ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్లి కాళ్లు పట్టుకుని పొత్తులు పెట్టుకు రావాల్సిన గత్యంతరం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు పట్టిందన్నారు.

ప్రజల సేవకు నలుగురం సిద్ధం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ తాను, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తమ కుమారులతో కలిసి నియోజకవర్గ ప్రజల సేవకు సిద్ధంగా ఉన్నామన్నారు. తామిద్దరం రాజకీయాల కోసం ఎప్పుడూ కులాలను వాడుకోలేదన్నారు. ఎంపీ బోస్ కుమారుడు సూర్యప్రకాశ్ తన కొడుకులాంటి వాడేనని, అందుకే ముఖ్యమంత్రి జగన్‌ను పట్టుబట్టి అతడిని సీటు ఇప్పించానన్నారు. తన అభిమానులందరూ సూర్యప్రకాశ్‌ను గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. ఇక నుంచి రామచంద్రపురం నియోజకవర్గంలో తోట వర్గం, బోసు వర్గం అంటూ ఉండవని, అంతా వైఎస్సార్ కుటుంబమేనన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కలసి పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా నియోజకవర్గానికి సేవలందిస్తున్న తన తండ్రి బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచనలు, సలహాలతో గెలుపు దిశగా కృషి చేస్తానన్నారు. ఎంపీ చింతా అనురాధ, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన తిరిగి రావాలని, ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్.. వీరందరికీ రైట్ రైట్...

- 33 శాఖలను గుర్తించిన ఈసీ
- జిల్లాలో 22 వేల మంది ఉంటారని అంచనా

రాయవరం: సార్వత్రిక ఎన్నికల్లో అత్యవసర ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయం ఉంది. ఈసారి ఎన్నికల్లో తొలిసారిగా అక్రిడేటెడ్ జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అయితే ఆరోజు జర్నలిస్టులు ఎన్నికల వార్తల సేకరణ విధుల్లో ఉండాలి. అలాగే ఎన్నికల కమిషన్ నుంచి పాసులు పొందాలి. జర్నలిస్టులతో పాటు ఎన్నికలతో సంబంధం లేని అత్యవసర సేవల రంగానికి చెందిన ఉద్యోగులు సైతం ఇకపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

వీరందరికీ అవకాశం

కేంద్ర ఎన్నికల కమిషన్ పలు విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ప్రజా రవాణా సంస్థ, పౌర సరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, షిప్పింగ్, ట్రెజరీ సర్వీస్, సమాచార పౌర సంబంధాలు, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, అటవీ, పోలీస్, పౌర రక్షణ, అగ్నిమాపక శాఖలు, అలాగే హోంగార్డులు, పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు తదితర 33 రకాల ఉద్యోగులు అత్యవసర సర్వీసుల కిందకు వస్తారు. వీరందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చు.

ప్రత్యేక నోడల్ అధికారి

జర్నలిస్టులు, అత్యవసర విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించే అవకాశముంది. నోడల్ అధికారుల వద్ద ఫారం-12డి అందుబాటులో ఉంటుంది. బ్యాలెట్ ఓటు వేయదలచిన వారు దానిని నింపి స్థానిక ఎన్నికల అధికారికి సమర్పించాలి. పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఒకటి చొప్పున రెండు ఫారాలు ఇస్తారు.

జిల్లాలో 22 వేల మంది


జిల్లాలో 22 వేల మంది వరకూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,644 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో పీవో, ఏపీవో, ఓపీవోలతో కలిపి 9,864 మంది వరకూ పోలింగ్ విధుల్లో ఉంటారు. వీరంతా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటారు. వీరు కాకుండా మరో 20 శాతం మంది, అంటే దాదాపుగా రెండు వేల మంది రిజర్వ్‌లో ఉంటారు. పోలింగ్ రోజున విధులు నిర్వర్తించే పోలీసులు, అత్యవసర సిబ్బంది, 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్లకు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశముంది. వీరంతా కలిసి దాదాపు జిల్లాలో దాదాపు 22 వేల మంది వరకు ఉంటారని అంచనా.



పోస్టల్ బ్యాలెట్ పొందాలంటే..

పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్లు పొందడానికి ఫారం-12ను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. అత్యవసర సిబ్బంది, పీడబ్ల్యూడీ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారు ఫారం-12డీను ఆర్‌వోకు అందజేయాలి. సంబంధిత దరఖాస్తులో వ్యక్తిగత వివరాలు, ఓటరు గుర్తింపు సమాచారం, పోస్టల్ బ్యాలెట్ ఎందుకు కోరుతున్నారో చెప్పాలి. రిటర్నింగ్ అధికారి వాటిని పరిశీలించి అర్హత ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేస్తారు. ఇంటి నుంచే ఓటు వేసే వృద్ధుల వద్దకు ఇద్దరు పోలింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్, సెక్యూరిటీ వచ్చి వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. వీరు ఏ తేది, ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇస్తారు. పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేసిన తర్వాత రెండుసార్లు అవకాశమిస్తారు. రెండుసార్లు వినియోగించుకోకుంటే ఇక ఓటు వేసే అవకాశముండదు. పోస్టల్ బ్యాలెట్ మంజూరు చేసిన తర్వాత సంబంధిత పోలింగ్ బూత్ ఓటరు జాబితాలో పీబీ అని నోట్ చేస్తారు.

ఓటు ఫ్రం హోమ్‌ను వినియోగించుకోవాలి



సాక్షి అమలాపురం: ఓట్ ఫ్రమ్ హోమ్ విధానంలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు ఓటు హక్కును ఇంటి నుంచే వినియోగించుకోవచ్చని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని పెంపొందించే దిశగా ఎన్నికల కమిషన్ ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. వీరి వద్దకే మొబైల్ వాహనాన్ని పంపి, ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆరంభమైందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణను పలుమార్లు పొడిగిస్తూ వచ్చిందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు.

క్లుప్తంగా

రైళ్లలో చోరీకి గురైన 9 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు అందజేసిన జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లలో చోరీకి గురవుతున్న మొబైల్ ఫోన్ల రికవరీకి నూతనంగా ప్రారంభించిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) యాప్ ఎంతో ఉపయోగంగా ఉందని రాజమహేంద్రవరం జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహనరావు తెలిపారు. సీఈఐఆర్ ద్వారా హెల్ప్ యు ట్రేస్ అండ్ బ్లాక్ యువర్ లాస్ట్ మొబైల్ ప్రక్రియలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్‌లో కార్యక్రమం నిర్వహించారు. జీఆర్పీ పరిధిలో దొంగతనానికి గురైన 9 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, వాటి యజమానులకు అందజేశారు. మోహనరావు మాట్లాడుతూ జీఆర్పీ ఆధ్వర్యంలో ఫోన్ల రికవరీకి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఆ బృందాలు విశాఖపట్నం, విజయనగరం, నెల్లూరు పరిసర ప్రాంతాలలో దర్యాప్తు చేసి ఫోన్లను రికవరీ చేశాయన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.విజయ శంకర్, ఎస్సైలు మావుళ్లు, లోవరాజు పాల్గొన్నారు.

మిర్చిమేరీ గోల్డ్ మొక్కల చోరీ

కడియం: దామిరెడ్డిపల్లి పంచాయతీ పరిధి నందన్నబాబు పుంతరోడ్డులోని ఓ నర్సరీలో 400 మిర్చిమేరీ గోల్డ్ మొక్కలను ఆదివారం రాత్రి దొంగలు పట్టుకుపోయారు. ప్యాకెట్లలో ఉన్న మొక్కలను పీక్కుని పట్టుకుపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం ఈ రకం మొక్కలు, విత్తనాలను చోరీ చేసేవారు. తర్వాత అలాంటి ఘటనలు తగ్గిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు మరోసారి చోరీ జరిగింది. ప్రస్తుతం ఈ రకం మొక్కల లభ్యత తక్కువగా ఉంది. ఒక్కో మొక్క ధర సుమారు రూ.2 వేలు పలుకుతోంది. ఒకవేళ ఇలా చోరీ చేసిన మొక్కలను ఎవరైనా రైతుల వద్దకు అమ్మకానికి తెస్తే తమకు సమాచారం ఇవ్వాలని నర్సరీ అసోసియేషన్ చెబుతోంది.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

రౌతులపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రమైన రౌతులపూడిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం వాహనాల తనిఖీ చేశాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం 3లోని ఏలేశ్వరం ఎంఈఓ–2 కె.వరలక్ష్మి ఆధ్వ ర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 20 లీటర్ల సారా ను తరలిస్తున్న రౌతులపూడికి చెందిన కైసర్ల రమణ, చిటికెల రమణ పట్టుబడ్డారు. వీరిని స్థానిక పోలీసులకు అప్పగించారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.అంతకు ముందు ఫ్లయింగ్ స్క్వాడ్ జేడీ ఆనంద కుమార్, రౌతులపూడి ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు.

గానోడెర్మా తెగులు తీరేవేరు

- వేరుకుళ్లు తెగులుతో కొబ్బరికి తీవ్ర నష్టం
- యాజమాన్య పద్ధతులే రక్ష



గానోడెర్మా తెగులు వ్యాపించిన కొబ్బరి చెట్లు

పాడి-పంట

అంబాజీపేట: కొబ్బరి పంట దిగుబడిని గణనీయంగా తగ్గించే కారణాలలో తెగుళ్లు ముఖ్యమైనవి. వాటిలో గానోడెర్మా శిలీంద్రం వలన కలిగే ఎర్రలక్క తెగులు అతి ప్రమాదకరం. ఈ తెగులు ఎక్కువగా వేసవి కాలంలో ఉధృతంగా వ్యాపిస్తుంది. తేలిక పాటి నేలలైన ఇసుక, ఎర్ర నెలలు, లంక భూములో ఉన్న కొబ్బరిచెట్లను ఆశిస్తుంది. ఈ గానోడెర్మా తెగులు లక్షణాలను అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ.చలపతిరావు వివరించారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే కొంత వరకూ కొబ్బరి చెట్లను కాపాడుకోవచ్చన్నారు. వేసవి కాలంలో చెట్లకు నీరు అందకపోవడం వల్ల ఈ తెగులు అధికంగా ఉంటుందని తెలిపారు. బూజుజాతికి చెందిన గానోడెర్మా అనే శిలీంద్రం కారణంగా ఇది వ్యాపిస్తుందన్నారు.

గానోడెర్మా తెగులు లక్షణాలు

గానోడెర్మా తెగులు తొలుత భూమిలో వేర్లను ఆశిస్తుంది. ఈ దశలో తెగులును గమనించలేరు. అధిక శాతం వేర్లు కుళ్లిన తరువాత కాండంలోకి వ్యాపించి కణాలను పూర్తిగా కుళ్లేలా చేస్తుంది. ఈ కుళ్లు భూమిలోనూ, కాండంలోని ఉండడం వల్ల బయటకు కనిపించదు. కాండం మొదలు చుట్టూ ఉన్న చిన్న చిన్న పగుళ్ల నుంచి ముదురు గోధుమ రంగు, తెలుపు రంగు కలిగిన చిక్కటి జిగురు వంటి ద్రవం బయటకు వస్తుంది. కాండంలోని కణ సముదాయం పూర్తిగా కుళ్లిపోవడం వల్ల చెట్టు అవసరమైన నీరు, పోషక లవణాలను భూమి నుంచి తీసుకోలేదు. దీంతో కొబ్బరి మొక్కలో పుష్పాల సంఖ్య బాగా తగ్గిపోవడమే కాకుండా మగపుష్పాల సంఖ్య పెరిగి ఆడ పుష్పాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. పిందెలు, కాయలు రాలడం ప్రారంభమవుతాయి.

యాజమాన్య పద్ధతులు

కొబ్బరి తోటలో గానోడెర్మా తెగులు లక్షణాలు గమనించిన వెంటనే తెగులు ఉన్న ప్రాంతంలో ఒక మీటరు లోతు, 50 సెంటీ మీటర్ల వెడల్పు కలిగిన గొయ్యిని తవ్వాలి. తెగులు ఎక్కువగా సోకిన చెట్లను వేర్లతో సహ పెకలించి తగులబెట్టాలి. ఆ గోతులలో చెత్త, గడ్డి వేసి తగులబెట్టాలి. చనిపోయిన చెట్ల స్థానంలో తిరిగి మొక్కలను నాటేముందు, గుంతలకు వారం, పది రోజులు సూర్యరశ్మికి బాగా ఎండేలా చేయాలి. తరువాత చెత్త చెదారం వేసి కాల్చడం ద్వారా వేరు కుళ్లు శిలీంద్రాలను నియంత్రించవచ్చు.

కొత్త మొక్కలు నాటేటప్పుడు..

కొత్త మొక్కలను తిరిగి నాటేటప్పుడు చెత్త వేసి కాల్చిన గోతులలో బాగా చివికిన పశువుల ఎరువు, కంపోస్ట్ ఎరువులతో పాటు 50 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి అనే శిలీంద్రపు పొడిని ఒక కిలో వేపపిండి మిశ్రమంతో నింపి మొక్కను నాటాలి. తెగులు ఎక్కువగా తేలిక నేలల్లో వస్తుంది. ఈ తేలిక నేలల్లో జీలుగు, జనుము వంటి పచ్చిరొట్ట పంటలు చిక్కగా పెంచి పూతకు వచ్చే దశలో భూమిలో కలియదున్నాలి. దీనివల్ల భూమిలో సేంద్రియ పదార్థాలు పెరిగి నీటిని నిల్వ చేసే శక్తి అధికమవుతుంది. చెట్ల మొదలు చుట్టూ రెండు మీటర్ల వ్యాసార్థం గల పళ్లేలు చేసి, బోదెల ద్వారా ప్రతి చెట్టుకూ విడివిడిగా నీరు పెట్టాలి.

ట్రైకోడెర్మా విరిడిని వినియోగించాలి



గానోడెర్మా తెగులు ఉన్న నేలల్లో కొబ్బరి చెట్టుకు ప్రతి ఏటా 50 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రపు పొడిని 5 కిలోల వేప పిండిలో కలిపి వేయాలి. ట్రైకోడెర్మా శిలీంద్రపు పొడిని బోర్డో మిశ్రమంతో లేక ఇతర తెగులు మందులతో కలిపి వాడరాదు. ఆ మందుల ప్రభావం వల్ల ఈ ట్రైకోడెర్మా శిలీంద్రంతో పాటు ఇతర లాభదాయక సూక్ష్మ జీవులు కూడా నశించిపోతాయి.

– డాక్టర్. ఎన్‌బీవీ చలపతిరావు,
ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి, అంబాజీపేట

కత్తియుద్ధంలో నైపుణ్యం ఎంతో అవసరం

- నన్నయ వీసీ పద్మరాజు
- జీఎస్ఎల్ కళాశాలలో ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ పద్మరాజు, డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: ఆసియన్ గేమ్స్‌లో కత్తియుద్ధం (ఫెన్సింగ్)లో కాంస్య పతకాన్ని సాధించిన తొలి భారతీయ వనిత సీఏ భవానీదేవిని స్ఫూర్తిగా తీసుకుని కత్తియుద్ధంలో నైపుణ్యం పెంచుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు సూచించారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో సోమవారం 25వ జాతీయ సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు మొదలయ్యాయి. యువజన, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ (ఏపీఎఫ్ఏ) నాలుగు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించనుంది. వీటికి 29 రాష్ట్రాల నుంచి 10 నుంచి 14 ఏళ్ల వయసున్న 250 మంది అమ్మాయిలు, 271 మంది అబ్బాయిలు హాజరయ్యారు. వీరి వెంట 160 మంది కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లతో వారి తల్లిదండ్రులు తరలివచ్చారు. సీనియర్ నేషనల్ ఫెన్సర్ ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి ఇద్దరి మధ్య మూడు నిమిషాల చొప్పున నిమిషం వ్యవధిలో వెంటవెంటనే మూడు సార్లు పోటీ ఉంటుందని, 15 పాయింట్లు సాధించిన వారిని విజేతలుగా ప్రకటిస్తామన్నారు. అసోసియేషన్ మెంటర్ ఎన్. సురేష్ బాబు మాట్లాడుతూ ఈ పోటీలలో నైపుణ్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన వారికి బంగారు, వెండి పతకాలు, తదుపరి స్థానంలో నిలిచిన ఇద్దరికి కాంస్య పతకాలు అందజేస్తారన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

జాతీయ పోటీలకు ఖోఖో జట్టు ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో స్థానిక నాయకులు, పీఈటీలు

కిర్లంపూడి: ఢిల్లీ వేదికగా జరిగే 56వ అఖిల భారత జాతీయ సీనియర్ బాలికల ఖోఖో ఛాంపియన్ షిప్‌కు సోమవారం రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కె.పట్టాభిరామ్ మాట్లాడుతూ స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఈ నెల 14న అంతర్రాష్ట్ర బాలికల ఖోఖో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాలకు చెందిన పి.చక్ర అనూష, హేమావతి, కె.కుమారి, ఎస్.అనురాధ, డి.శివనాగలక్ష్మి, డి.అఖిల, పి.రేవతి, కె.రమ్య, బి.శిరీష, వి.మోహన సత్యసింధు, పి.హేమ, వి.ప్రీతిరోజ్, ఎం.దివ్యశ్రీ, ఎం.అక్షయ, కె.చైతన్య ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి సమకూర్చిన క్రీడా దుస్తులను అందజేశారు. అసోసియేషన్ చీఫ్ పాట్నర్ పెంటకోట నాగబాబు, తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చదలవాడ బాబీ, పూర్వ క్రీడాకారులు వారిని అభినందించారు.

సాగర తీరం.. విన్యాసాలకు సిద్ధం

- నేటి నుంచి భారత్, అమెరికా రక్షణ దళాల సంయుక్త విన్యాసాలు
- ముస్తాబైన సూర్యారావు పేట బీచ్
- కాకినాడ – ఉప్పాడ రోడ్డులో రాకపోకల బంద్



విన్యాసాల కారణంగా మూతబడిన కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డు



తీరంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ రూరల్: దేశ రక్షణ, భారత భూభాగంలోకి టెర్రరిస్టులు, శత్రువులు సముద్ర మార్గన చొరబడి దాడి చేసినప్పుడు, వారిని ఏ విధంగా ప్రతిఘటించాలి, ఉగ్రవాద నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధ సమయంలో నిర్వహించే దాడులు.. ఇలా కళ్లకు కట్టేలా విన్యాసాలు నిర్వహించేందుకు భారత రక్షణ దళాలు కాకినాడకు చేరుకున్నాయి. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో మన త్రివిధ దళాలతో పాటు అమెరికా రక్షణ దళాలు సంయుక్తంగా టైగర్ ట్రయాంఫ్ పేరిట ఇప్పటికే విశాఖపట్నం సముద్ర తీరంలో విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. వాటికి కొనసాగింపుగా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నావెల్ ఎన్‌క్లేవ్ సమీపంలోని పాత ఎన్టీఆర్ బీచ్ వద్ద మంగళవారం నుంచి ఈ నెల 29 వరకూ సంయుక్త విన్యాసాలు జరగనున్నాయి. యాంఫీబీఎస్ (ఉభయచర) అంటే సముద్రంతో పాటు ఒడ్డున ఈ విన్యాసాలు చేపట్టనున్నారు. ఇప్పటికే నేవీ సిబ్బందితో పాటు ఆర్మీ, ఎయిర్స్ ఫోర్స్ సిబ్బంది కాకినాడ తీరానికి చేరుకున్నారు. భారత్, అమెరికా సంయుక్త విన్యాసాలకు రక్షణ దళాలు వస్తుండడంతో భద్రతా చర్యలు చేపట్టారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సోమవారం పరిశీలించారు. హెలీ ప్యాడ్, ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్, నావెల్ ఎన్‌క్లేవ్‌ను పరిశీలించి భద్రతా చర్యలు, బందోబస్తుపై నేవీ అధికారులతో సంప్రదించారు.

ప్రజలకు అనుమతి లేదు : ఎస్పీ

ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ సూర్యారావుపేటలో నాలుగు రోజుల పాటు భారత్, అమెరికా రక్షణ దళాల సంయుక్త విన్యాసాలు జరిగే అవకాశం ఉందన్నారు. వీటిని చూసేందుకు ప్రజలకు అనుమతి లేదన్నారు. అత్యాధునిక యుద్ధ నౌకలు, యుద్ధ ట్యాంకర్లతో పాటు భారత్, యూఎస్‌కు చెందిన సుమారు 800 మంది సిబ్బంది, అధికారులు పాల్గొంటారన్నారు. టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల కారణంగా కాకినాడ - ఉప్పాడ బీచ్ రోడ్డులో మంగళవారం నుంచి ఈనెల 29 వరకూ రాకపోకలకు అనుమతి లేదన్నారు. వాహనదారులు అచ్చంపేట జంక్షన్, పిఠాపురం మీదుగా రాకపోకాలు సాగించాలన్నారు. ఎస్పీతో డీఎస్పీ హనుమంతరావు, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై రవీంద్ర బాబు, సిబ్బంది ఉన్నారు.

ఏలేరు కాలువలో పడి వృద్ధుడి మృతి

పెద్దాపురం: బహిర్భూమికి వెళ్లిన వృద్ధుడు ఏలేరు కాలువలో జారి పడి మృతి చెందాడు. చదలాడలో సోమవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాడాల సూర్యనారాయణ (70) రెండు రోజులుగా కనిపించడం లేదు. ఎవరైనా బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు అతడి కోసం ఆరా తీస్తున్నారు. సోమవారం ఉదయం ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం తేలడాన్ని గమనించిన స్థానికులు.. పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వి.సురేష్ ఆదేశాల మేరకు ఆ మృతదేహన్ని సిబ్బంది బయటకు తీశారు. అయితే మృతదేహం సూర్యనారాయణదిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన మహిళకు ఏడాది జైలు, రూ.5 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడకు చెందిన పంగం లక్ష్మి నుంచి కాకినాడ విద్యుత్ నగర్ చెందిన మాకిరెడ్డి సునందశ్రీ 2017లో రూ.4.50 లక్షలు అప్పు తీసుకుంది. బాకీ తీర్చేందుకు 2019లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చింది. ఆ చెక్కును లక్ష్మి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించింది. కోర్టు విచారణలో మాకిరెడ్డి సునందశ్రీపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.ఐదు లక్ష పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

అమలాపురంలో ఆబోతు వీరంగం

- ఇద్దరికి గాయాలు
- ఎట్టకేలకు బంధించిన ఫైర్, పోలీస్ సిబ్బంది, స్థానికులు



ఆబోతును బంధిస్తున్న స్థానికులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఆబోతు వీరంగం సృష్టించి, ప్రజలను పరుగులు తీయించింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మెయిన్ రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్, నల్లవంతెన తదితర ప్రాంతాల్లో రంకెలు వేస్తూ, కాలు దువ్వుతూ చెలరేగిపోయింది. అదుపు చేసేందుకు ప్రయత్నించిన వారిని కొమ్ములతో కుమ్మేందుకు సిద్ధమైంది. దీని వీరంగంతో ఇద్దరు గాయపడ్డారు. దాన్ని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కూడా రంగ ప్రవేశం చేశారు. ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు దానిని బంధించేందుకు నానా యాతనలు పడ్డారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌తో పాటు గ్యారేజ్ ప్రాంగణంలోకి ఆబోతు వెళ్లి వీరంగం చేసింది. ప్రయాణికులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. బస్‌స్టేషన్ ప్రాంగణంతో పాటు నల్లవంతెన వద్ద ఆబోతును బంధించేందుకు అగ్నిమాపక సిబ్బంది పైపులతో వాటర్ ఫోర్స్‌ను ఉపయోగించారు. చివరకు స్థానిక నల్ల వంతెన వద్ద కాటన్ పార్కులో ఆబోతును బంధించారు.

అంతా మా ఇష్టం..

- టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల తీరు
- అనుమతి లేకుండా సమావేశం
- అధికారుల రంగప్రవేశంతో జారుకున్న వైనం



అంబాజీపేటలో ఆత్మీయ కలయికలో పాల్గొన్న ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణ

అంబాజీపేట: అంతా మా ఇష్టం.. మేం చేసేది మీరు చూస్తూ కూర్చోవటమే.. ఈసీ ఆదేశించినా మా ఇష్టం వచ్చినట్లు మేం చేస్తాం అన్నట్లుంది పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నేతల తీరు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, ఇష్టం వచ్చినట్లు ఆత్మీయ కలయిక అంటూ ప్రచారాలు చేస్తున్నారు. ఎన్నికల సభలు, ఆత్మీయ కలయిక, సమావేశాలకు ఎన్నికల అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. కానీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల కమిషన్‌ను ఏ మాత్రం లెక్కచేయడం లేదు. పుల్లేటికుర్రు, అంబాజీపేట బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌తో పాటు స్థానిక వెంకట్రాజు ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ వద్ద సోమవారం రాత్రి బహిరంగ సభ మాదిరిగా టెంట్లు ఏర్పాటు చేసి హడావుడి చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకోలేదు. భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు హంగామా చేయడంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. ఎంపీడీఓ వరలక్ష్మి, ఎస్సై కె.చిరంజీవి, పోలీస్ సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడకు చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఒక్కొక్కరూ అక్కడి నుండి జారుకున్నారు. దీనిపై ఎంపీడీఓ వరలక్ష్మిని వివరణ కోరగా సమావేశం జరుగుతున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ దృష్టికి రావడంతో నియోజకవర్గ ఎన్నికల అధికారికి సమాచారం అందించారన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని సమావేశాన్ని అడ్డుకున్నామన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు, ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.